సాక్షి నంద్యాల

మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్ర దీపార్చన సేవ నిర్వహించింది. పురాతన మండపంలో ఉత్స వమూర్తులకు అర్చకులు పూజలు చేశారు.



అలరించిన నృత్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యావేదికపై సోమవారం ఒంగోలుకు చెందిన రాఘవ కూచిపూడి నృత్య సంగీత కళానిలయం కళాకారులు సంప్రదాయ నృత్యంతో అలరించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,626.56
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 81.661
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 245
అవుట్ ఫ్లో	: 9,035

న్యూస్‌రీల్

మద్దిలేటయ్య హుండీ కానుకల లెక్కింపు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు, ముడుపులను సోమవారం లెక్కించారు. దేవదాయశాఖ అధికారి రమేష్ పర్యవేక్షణలో ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో 32 రోజులకు సంబంధించి లెక్కించగా నగదు రూ. 25,41,355, బంగారం 17.50 గ్రాములు, 800. 250 గ్రాముల వెండి వచ్చింది. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రావు, వేదపండితులు, అర్చకులు, బేతంచెర్ల, డోన్ మండలాలకు చెందిన మహిళా భక్తులు పాల్గొన్నారు.

డీఆర్‌పీల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎస్ఈఈడీఏపీ), పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ఎంఈ) కింద జిల్లా రిసోర్స్ పర్సన్ ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల తెలిపారు. ఈ పథకం కింద క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ ప్రోగ్రాం కింద చిన్న తరహా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు పీఎంఎఫ్ఎంఈ యొక్క నోడల్ ఏజెన్సీ అయిన ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా డీఆర్‌పీలుగా నియమించబడతారని తెలిపారు. 21–30 ఏళ్ల వయస్సు ఉండి ఏదైన గ్రాడ్యుయేట్ పూర్తి చేసి ఉండాలని, ప్రతి మండలానికి ఒక డీఆర్‌పీని రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. డీఆర్‌పీలుగా నియమితులైన తర్వాత పనితీరును బట్టి ఇన్సెంటివ్ ఇస్తామన్నారు. కర్నూలు జిల్లాకు 25, నంద్యాల జిల్లాకు 29 మంది డీఆర్‌పీలను నియమిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు జనవరి 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హెల్మెట్ తప్పనిసరి

బొమ్మలసత్రం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా సూచించారు. సోమవారం పోలీసులు హెల్మెట్ ధరించి బైక్‌లు నడుపుతూ స్థానిక టెక్కె మార్కెట్ యార్డు నుంచి గాంధీచౌక్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని మాట్లాడారు. ప్రమాదాల సమయంలో హెల్మెట్ తలకు రక్షణగా ఉంటుందన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న దర్శనానికి 4 గంటలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మ వార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. సోమవారం పరమేశ్వరుడికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది శ్రీగిరి చేరుకుని పాతాళగంగ లో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

డోన్ టౌన్ : వసతి గృహాల్లోని విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలని ఎస్సీ సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారిణి చింతామణి, బీసీ సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ముస్తాక్ అన్నారు. పట్టణంలోని కొండపేటలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని వారు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు.

వైభవంగా హనుమజ్జయంతి



ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో శ్రీ బీగాల ఆంజనేయస్వామి జయంతి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ధనుర్మాసం వైగత్ వాయిర్వగల్ పాశురం తొండర అడిపొడి ఆళ్వారు తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని వార్షిక హనుమత్ జయంతిని శాస్త్రోక్తంగా నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం తెల్లవారు జామున ప్రహ్లాదవరదుడు ఉభయ దేవేరులతో ఉత్సవ పల్లకీలో కొలువై ఊరేగింపుగా దిగువ అహోబిలం దేవాలయం ఎదురుగా ఉన్న బీగాల ఆంజనేయ స్వామి సన్నిధికి చేరుకున్నారు. అక్కడ స్వామి, అమ్మ వార్ల సమక్షంలో మూలమూర్తి ఆంజనేయ స్వామికి ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలు.. వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య నవకలశాలతో అభిషేకించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన స్వామి అమ్మవార్లకు పట్టు పీతాంబరాలతో ప్రత్యేకంగా అలంకరించి ఆంజనేయ స్వామి సన్నిధిలోనే కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



వ్యవసాయానికి కలసి రాలేదు

2024 సంవత్సరం వ్యవసాయానికి కలసి రాలేదు. ఈ ఏడాది జూన్ 19, 20 తేదీల్లో ఉమ్మడి జిల్లాలో సెంట్రల్ టీమ్ పర్యటించింది. కేంద్రం ఎన్‌డీఆర్ఎఫ్ నామ్స్ ప్రకారం రాష్ట్రానికి పరిహారం విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఆర్ఎఫ్ నామ్స్ ప్రకారం రైతులకు రూ. 96 కోట్లకు పైగా పరిహారం విడుదల చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో 51 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కర్నూలు జిల్లాలో 32 మంది, నంద్యాల జిల్లాలో 19 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఆత్మహత్యలకు పాల్పడిన ఒక్క రైతు కుటుంబానికి కూడా ఇప్పటివరకు పరిహారం అందించిన దాఖలాలు లేవు.



అట్టహాసంగా 6వ పట్టాభిషేకం...

కర్నూలు నగర శివారులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ మ్యానుఫ్యాక్చరింగ్(ఐఐఐటీడీఎం)లో ఈ ఏడాది జూన్ 22వ తేదీన 6వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నీతి ఆయోగ్ సభ్యుడు, జేఎన్‌యూ చాన్సులర్ డాక్టర్ వీకే సారస్వత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ స్నాతకోత్సవంలో 2020–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీటెక్ పూర్తి చేసిన 143 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఐదుగురు విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు.



రైతన్నకు దక్కని భరోసా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు పెట్టుబడి సాయం, ఖరీఫ్, రబీ సీజన్లకు ముందే అందేది. పంటలకు గిట్టుబాటు ధర లేకపోతే గత ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసేది. గ్రామాల్లోనే రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, మందులు అందుబాటులో ఉంచి తక్కువ ధరకే వాటిని అందించేది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు కష్టాలు మొదలయ్యాయి. ఎన్నికల హామీ మేరకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20వేలు అందలేదు. పంట బీమా లేదు. గిట్టుబాటు ధర లేదు. దీంతో గతంలో ఎప్పుడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వెలుగులను మింగిన చీకట్లు



కొత్త ప్రజాప్రతినిధులు..

జూన్ 4వ తేదీన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో నంద్యాల ఎంపీగా బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలుగా ఎన్ఎండీ ఫరూక్, భూమా అఖిలప్రియ, బీసీ జనార్థన్‌రెడ్డి, జయసూర్య, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, గౌరుచరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి గెలుపొందారు. వీరిలో బీసీ జనార్దన్‌రెడ్డి జిల్లా నుంచి రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా, ఎన్ఎండీ ఫరూక్ న్యాయశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.



కాల చక్రంలో 2024 సంవత్సరం మరి కొద్ది గంటల్లో కరిగిపోతుంది. జిల్లా ప్రజలకు ఈ ఏడాది తొలి ఆర్నెల్లు ఆనందం.. ఆర్నెల్లు ఆందోళనలు మిగిల్చింది. జననేత వైఎస్ జగన్ పాలనలో సంక్షేమ పథకాలు అందుకుని ఆనందాలతో జీవనం సాగించారు. అంతలోనే ప్రభుత్వం మారిపోగా అన్ని వర్గాలకు అవస్థలు తోడయ్యాయి. వ్యవసాయం నష్టాలు మిగిల్చింది. సంక్షేమ పథకాలు దూరమయ్యాయి. అభివృద్ధి నిలిచిపోయింది. అన్ని వర్గాల్లో ఆందోళన మొదలైంది. కూటమి పాలకులు హామీలు వల్లె వేస్తున్నారే కాని ప్రజా సంక్షేమాన్ని విస్మరించారు. అంతలోనే ఎంత మార్పు అంటూ ఈ ఏడాదిలో చోటు చేసుకున్న సంఘటనలను జిల్లా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. – నంద్యాల



అధికార యంత్రాంగం మార్పు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భారీ స్థాయిలో అధికారుల స్థానాలను మార్పు చేశారు. నంద్యాల జిల్లా కలెక్టర్‌గా రాజకుమారి, ఎస్పీగా అధిరాజ్‌సింగ్‌రాణా వచ్చారు. తర్వాత జిల్లాలో ఆర్‌డీఓ స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు అధికారుల బదిలీ జరిగింది.



ముగ్గురు మంత్రులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం మంత్రులుగా ఉండగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముగ్గురు మంత్రులు కొలువుదీరారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జూలై 19వ తేదిన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ హాజరయ్యారు.

దూరమైన 'సంక్షేమం'



అధికారం కోసం ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ముఖ్యంగా చంద్రబాబు నాయుడు అనేక హామీలు గుప్పించారు. సూపర్ సిక్స్ పేరుతో యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ. 3 వేల నిరుద్యోగభృతి, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ. 20 వేలు సాయం, తల్లికి వందనం కింద ఏడాదికి ఒక్కో విద్యార్థికి రూ. 15 వేలు, ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా ప్రతి కుటుంబానికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామని చెప్పారు. అధికారం చేపట్టి ఆరునెలలు గడిచినా ఇందులో ఇప్పటి వరకు ఏ ఒక్కటీ అమలు కాలేదు. కేవలం ఒక్క సిలిండర్ ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఉండేదని కూటమి ప్రభుత్వంలో గొప్పలు తప్ప హామీల అమలు లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పసిడి కాంతులు



ఈ ఏడాది 'పసిడి'కాంతులు విరజిమ్మాయి. గతంలో ఏ సంవత్సరంలో లేని విధంగా బంగారం ధరలు ధగధగలాడాయి. ధరలు ఆకాశాన్నంటుతున్నప్పటికి కొనుగోళ్లు మాత్రం తగ్గడం లేదు. ఈ ఏడాది జనవరి 1వ తేదీన 10 గ్రాముల ఆర్నమెంటు బంగారం ధర రూ.50,600 ఉంది. ఈ ఏడాది డిసెంబరు నెలలో 10 గ్రాముల బంగారం ధర రూ.73,500లకు చేరింది. అంటే రికార్డు స్థాయిలో 10 గ్రాములపై రూ.22,900 పెరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు రూ.5 వేల కోట్ల బంగారం వ్యాపారం జరిగినట్లు అనధికార సమాచారం.



కూటమి పాలనపై తిరుగుబాటు...

అన్నదాతకు అండగా ఈనెల 13న జిల్లా కేంద్రం నంద్యాలలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన భారీ ఆందోళన

కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి రాగానే డిమాండ్ల సాధన కోసం ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన, రాజకీయ పార్టీలు దండెత్తాయి. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని వైఎస్ఆర్‌సీపీ, ఇసుక రేట్లను తగ్గించాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున్న ఆందోళలు నిర్వహించారు. అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాలల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధి హామీలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు తమకు ఉద్యోగ భద్రతతోపాటు వేతనాలను పెంచాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళనలతో హోరెత్తించారు.

ఎప్పుడెప్పుడు ఏం జరిగిందంటే..

జనవరిలో..: జగనన్న తోడు కింద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 8వ విడతలో 14,142మందికి రూ.14.96కోట్ల వడ్డీలేని రుణాలు అందజేసింది. 23వ తేదీ వైఎస్సార్ ఆసరా పథకం కింద 26,012 స్వయం సహాయక సంఘాలకు చెందిన 2,53,077 మహిళా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.167.41 కోట్లు జమ చేసి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడింది.

ఫిబ్రవరిలో..: 28వ తేదీ వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ కింద రైతులకు వరుసగా ఐదో ఏడాది మూడో విడతగా జిల్లాలో 2,34,151 మందికి రూ.47.06 కోట్ల లబ్ధి చేకూరింది.

మార్చిలో..: మార్చి నెలలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని అహోబిలంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. మన రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

- 14వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలోని బనగానపల్లెకు వచ్చారు. ఇక్కడ వైఎస్సార్ ఈబీసీ నేస్తం మూడవ విడత కింద జిల్లాలో 15,163 మంది మహిళలకు రూ.22.75 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. మూడు విడతలుగా జిల్లాలో 44,292 మంది మహిళలకు రూ.67.60 కోట్ల లబ్ధి చేకూరింది.

ఏప్రిల్, మే, జూన్..: ఈ మూడునెలలను ఎన్నికల మాసంగా చెప్పవచ్చు. ఏప్రిల్, మే అభ్యర్థుల ప్రచారంతో హోరెత్తాయి. ఏప్రిల్ 18వ తేదీన సార్వత్రి ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మే 12వ తేదీన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగింది. జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి.

జులైలో..: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి నెలరోజుల్లోనే నందికొట్కూరు నియోజకవర్గంలోని పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన 9 ఏళ్ల బాలిక ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు బాలలు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆపై చిన్నారిని చంపేశారు.రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైన ఈ కేసును పోలీసులు ఇప్పటి వరకు ఛేదించలేదు. బాలిక మృతదేహాన్ని కనుగొనలేదు.



ఆగస్టులో..: 3వ తేది శ్రీశైలం నియోజకవర్గం మహానంది మండలం సీతారామపురం గ్రామానికి చెందిన పసుపులేటి సుబ్బరాయుడును అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బుడ్డారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు దారుణంగా హత్య చేశారు. సుబ్బరాయుడు, ఆయన కుమారులు వైఎస్సార్‌సీపీలో చేరడంతో పాటు ఆయన కుమారుడు నాగప్రసాద్ ఎన్నికల సమయంలో ఏజెంట్‌గా కూర్చోవడంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. 9న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

సెప్టెంబర్‌లో..: నంద్యాల పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు అహమ్మద్‌ను ట్రేడ్ మార్కెటింగ్ పేరుతో ఇద్దరు వ్యక్తులు రూ. 4.60 లక్షలు పెట్టుబడి పెట్టించి బురిడీ కొట్టించడంతో అతను ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

అక్టోబర్‌లో..: ఆలయాలకు పుట్టినిల్లు అయిన నంద్యాల జిల్లాలో దేవీనవరాత్రోత్సాలు వైభవంగా జరిగాయి. 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు దుర్గాదేవి పలు అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

నవంబర్‌లో..: ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు తమకు వేతనాలు పెంచాలని నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఆశా వర్కర్లు ముట్టడించారు.

డిసెంబర్‌లో..: 13వ తేదీన కూటమి ప్రభుత్వంపై రైతులు కన్నెర్ర చేశారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా చేశారు.

- విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 27న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాటు కార్యక్రమం నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించారు. కూటమి సర్కారుపై ప్రజలు నిరసన తెలిపారు.

నిఘా నీడలో కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షలు



పరుగు పోటీల్లో పాల్గొన్న కానిస్టేబుల్ అభ్యర్థులు

- మొదటి రోజు 280 మంది హాజరు
- పరుగు పోటీలను ప్రారంభించిన ఎస్పీ
- నెల రోజుల పాటు సాగనున్న ప్రక్రియ

కర్నూలు: కానిస్టేబుల్ నియామక పరీక్షల్లో ద్వితీయ ఘట్టం శారీరక, దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10,143 మంది ప్రాథమిక రాత పరీక్షలో ఉత్తర్ణులయ్యారు. అందులో మొదటి రోజు సోమవారం 600 మందిని దేహదారుఢ్య పరీక్షలకు ఆహ్వానించగా 280 మంది హాజరయ్యారు. మొదట ధ్రువపత్రాలు, శారీరక కొలతల పరిశీలన (పీఎంటీ), దేహదారుఢ్య పరీక్ష (పీఈటీ) నిర్వహించారు. ఇందులో అర్హత పొందినవారికి లాంగ్ జంప్, పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ప్రారంభించారు.

వేకువజామునే మైదానానికి

పరీక్ష విధులకు నియమించిన పోలీసు, సాంకేతిక, పోలీసు కార్యాలయ పరిపాలనా విభాగం సిబ్బందితో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు (పీడీ) వేకువజామున 5 గంటలకే ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలం మైదానానికి చేరుకున్నారు. అప్పటికే క్యూలో ఉన్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలించి బయోమెట్రిక్ అథెంటికేషన్ ట్యాగ్‌లు, క్యూఆర్ కోడ్‌తో ఉన్న టీషర్టులు ధరింపజేసి పోటీలు నిర్వహించారు. ఇదిలా ఉంటే రిక్రూట్‌మెంట్ నిర్వహణ జరుగుతున్న మైదానం చుట్టూ భారీ పోలీసు బందోబస్తుతో పాటు ప్రతి ఈవెంట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి నిఘా నీడలో పరీక్షలు జరిపారు.రిక్రూట్‌మెంట్ బోర్డు కేటాయించిన తేదీల్లో అభ్యర్థులు ఫిబ్రవరి 1వ తేదీ వరకు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుంది.

నేడు పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): జనవరి నెలకు సంబంధించిన పింఛన్లను డిసెంబరు 31వ తేదీనే పంపిణీ చేసేందుకు కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారులు ఏర్పట్లు చేశారు. జనవరి 1న నూతన సంవత్సర వేడుకలు ఉన్నందున ఒక రోజు ముందుగానే మంగళవారం పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో 4,55,929 పింఛన్లకు రూ.194.65 కోట్లు సోమవారం బ్యాంకులకు విడుదల అయ్యాయి. కర్నూలు జిల్లాలో 2,39,818 పింఛన్‌లకు సంబంధించి రూ.102 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,16,111 పింఛన్‌లకు సంబంధించి రూ.91 కోట్లు ప్రకారం రూ.194 కోట్లు మంజూరు అయ్యాయి. గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకుల నుంచి పింఛన్ సొమ్ము డ్రా చేశారు. ఇదిలా ఉంటే స్పౌజ్ కేటగిరి కింద ఉమ్మడి కర్నూలు జిల్లాకు 369 పింఛన్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు.

డ్యాంలో 112 టీఎంసీల నీరు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలో సోమవారం సాయంత్రం సమయానికి 111.9430 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 861.90 అడుగులకు చేరుకుంది. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో పంప్‌మోడ్ ఆపరేషన్‌తో 6,307 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి మళ్లించారు.

ప్రజా వినతులు నాణ్యతతో పరిష్కరించండి

- పీజీఆర్ఎస్‌లో అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాముఖ్యత ఇచ్చి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి స్వీకరించిన 18 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఏపీ సేవా సర్వీసులను కూడా క్లియర్ చేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను కూడా అప్‌లోడ్ చేయాలన్నారు. ఫిర్యాదుల స్వీకరణకు ముందు జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ కార్యకలాపాలకు సంబంధించిన దస్త్రాలన్నీ ఈ – ఆఫీస్ ద్వారా సిగ్నేచర్ లేకుండా వస్తున్నాయని, ఈ – ఫైలింగ్ విధానంపై పూర్తిస్థాయి అవగాహన పొంది ప్రతి ఫైలు ఈ–ఆఫీస్ ద్వారానే రావాలన్నారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు ప్రజలకు అందుబాటులో ఉండి పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా కింద నేడు పెన్షన్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఆధార్ లేని గిరిజనులకు నోటరీ లేకుండా జనన ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అపార్ ఐడీ జనరేషన్ కోసం ఇంటర్ విద్యార్థులకు కూడా జనన ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించండి

ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలు ప్రాంగణంలో చిరుధాన్యాల ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన కాయగూరలు, ఆకు కూరల స్టాళ్లను పరిశీలించి మాట్లాడారు. తక్కువ ఖర్చుతో సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే చిరుధాన్యాలు, సేంద్రియ ఆహార ఉత్పత్తులను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

క్లుప్తంగా

కాల్వలో పడి వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామం బస్టాండు సమీపంలో ఉన్న కాల్వలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటేష్ సోమవారం తెలిపారు. సుమారు 30–40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందన్నారు. రెండు రోజుల నుంచి గుండుపాపల, ఒంటివెలుగల గ్రామాల్లో తిరిగినట్లు స్థానికులు తెలిపినట్లు చెప్పారు. ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందినట్లు తెలిసిందన్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు మృతదేహాన్ని వెలికి తీసినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వెంటనే 9121101178, 9121101166 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

క్లిక్ చేశాడు..డబ్బు మాయం

కొలిమిగుండ్ల: సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతూనే ఉన్నారు. నిత్యం ఎక్కడో ఒక చోట అమాయకులు సైబర్ కేటుగాళ్ల బారిన పడి మోసపోతూనే ఉన్నారు. సోమవారం కనకాద్రిపల్లెకు చెందిన ఓ యువకుడు రూ.25 వేలు పోగొట్టుకున్నాడు. ఎస్‌బీఐకి చెందిన యూనో పాస్ వర్డ్ లాక్ అయింది.. మార్చుకోమని సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. ఏమాత్రం ఆలోచించకుండా ఆ యువకుడు తమ సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. డేటా అంతా వారి చేతుల్లోకి వెళ్లిపోవడంతో అకౌంట్‌లో ఉన్న రూ.25 వేలు మాయమయ్యాయి. మోసపోయానని తెలుసుకొని 1930 కాల్ సెంటర్‌కు సమాచారం ఇచ్చాడు.

39.549 కేజీల గంజాయి దహనం


గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లాలో వివిధ కేసుల్లో పట్టుబడిన 39.549 కేజీల గంజాయిని పోలీసులు పట్టణ శివారులో దహనం చేశారు. ఈసందర్భంగా అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు మాట్లాడుతూ జిల్లాలో నమోదైన 17 కేసుల్లో 39.549 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు దహనం చేశామన్నారు.

మత్తు పదార్థాలు సీజ్

డోన్ రూరల్: 2.3 కేజీల(ఓపీఎం పాపి హస్క పౌడర్) మత్తు పదార్థాన్ని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ.వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్యాపిలి మండలం ఎనుగమర్రి గ్రామంలోని మహదేవ్ హోటల్ వద్ద దాడులు నిర్వహించగా రాజస్తాన్ రాష్ట్రం నాగూర్ జిల్లా మెట్రా మండలం సంకహవాస్ గ్రామానికి చెందిన నార్‌పత్ అనుమానంగా ఉండటంతో అదుపులోకి తీసుకుని సోదాలు చేశామన్నారు. అతని వద్ద మత్తు పదార్థాలు ఉండటంతో అరెస్ట్ చేసి 2.3 కేజీల మత్తు పదార్థం స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో సీఐ.జయరాంనాయుడు, ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌బాషా, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మీ నారాయణ, సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఉమాకాంత్‌రెడ్డి, రంగస్వామి, నరసింహులు, అల్లస్వామి, బషీర్ పాల్గొన్నారు.

మందుబాబుకు జైలు శిక్ష

బండి ఆత్మకూరు: మండలంలోని వెంగళరెడ్డి పేట గ్రామానికి చెందిన మందుబాబు గుర్రప్పకు నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారని ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు. గుర్రప్ప గ్రామంలో మద్యం తాగి చుట్టుక్కల మహిళలను అసభ్యపదజాలంతో తిడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నండగా స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గుర్రప్పను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా జడ్జి 5 రోజులు జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ తెలిపారు.

100 మీటర్ల పరుగుపందెం పోటీని ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, హోంగార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ మేకల మహేష్



ఒకటే లక్ష్యం.. ఒకటే గమ్యం

ఉద్యోగమే లక్ష్యంగా యువత మైదానంలోకి అడుగు పెట్టింది. అలుపెరగకుండా పరుగులు తీశారు. అడ్డంకులను అధిగమిస్తామంటూ లాంగ్ జంప్ చేశారు. పోలీసు కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఏపీఎస్పీ రెండో పటాలంలో సోమవారం అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, కర్నూలు


లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి


కాలికి ఎలక్ట్రానిక్ చిప్ అమర్చుతున్న సిబ్బంది


అభ్యర్థులకు సూచనలిస్తున్న పోలీసులు

జిల్లాలో పెండింగ్ ప్రాజెక్ట్‌లు పూర్తి చేయాలి


సీపీఎం జిల్లా నూతన కార్యవర్గ సభ్యులతో కేంద్ర, రాష్ట్ర నాయకులు

- జిల్లా మహాసభలో తీర్మానం

ఎమ్మిగనూరు టౌన్: జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని తదితర అంశాలపై సీపీఎం 23వ జిల్లా మహాసభ తీర్మానించింది. రెండు రోజుల పాటు జరిగిన జిల్లా మహాసభల్లో భాగంగా సోమవారం సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్, రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నిర్మల, రామన్న పాల్గొని మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని, జిల్లాలో ఐటీ, ఫార్మా కంపెనీల ఏరాటు, జిల్లా కేంద్రంలోని సర్వజన వైద్యశాలను ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని సభలో తీర్మానం చేసినట్లు వారు పేర్కొన్నారు. దళితులపై దాడులను ఆపాలని, వృత్తిదారుల సమస్యలు పరిష్కరించి గొర్రెలు, మేకల పెంపకం దార్లకు ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని, చేనేత కేంద్రాల్లో చేనేత పార్కులు ఏర్పాటు చేయాలని సభలో తీర్మానం చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యద ర్శిగా రెండోసారి గౌస్‌దేశాయ్‌ను ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులుగా పి.నిర్మల, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, కెవి.నారాయణ, ఎండీ అంజిబాబు, ఆనంద్‌బాబు, టి.రాముడులను ఎన్నుకున్నారు.

అమిత్‌షా హోంమంత్రిగా అనర్హుడు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆ పదవికి అనర్హుడని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగకర్తను అవమానపరిచిన హోం మంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు రామాంజనేయులు, రాధాకృష్ణ, గోవిందు, హనుమంతు పాల్గొన్నారు.

కుల గణన జాబితాలో ఎస్సీయేతరులను తొలగించండి


డీడీకి వినతి పత్రం అందిస్తున్న డీవీఎంసీ సభ్యులు

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డ్ కులాల కుల గణనకు సంబంధించి గ్రామ/వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన జాబితాల్లోని ఎస్సీయేతర కులాలను తొలగించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సభ్యులు రమేష్‌బాబు, రవి శాస్త్రి, చిటికెల సామేల్, ఎరుకల రాజు, శాంతికుమార్, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసారపు వెంకటేష్ సోమవారం సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కే తులసీదేవిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయాల వద్ద ఏర్పాటు జాబితాలో మాల, మాదిగ, మాల క్రిష్టియన్, మాదిగ క్రిష్టియన్, ఆది ఆంధ్ర తదితర కులాలు కాకుండా ఎస్సీయేతర కులాలు ఉన్నాయన్నారు. తప్పుడు సమాచారంతో మదాసి కురువ, బేడ బుడగ జంగం , బరికి, పంబాల తదితర కులాల పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు పొందారని, వాటన్నింటిని గ్రామ సచివాలయాల్లో తొలగించాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి సాంఘీక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి రేమాండ్ పీటర్ 10 కులాలను ఎస్సీ కులాల జాబితాలో నుంచి తొలగించాలని ప్రభుత్వానికి లేఖ కూడా రాశారన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

2, 3 తేదీల్లో కేంద్ర బృందం పర్యటన


పొలాల్లో పర్యటిస్తున్న వ్యవసాయాధికారులు

కౌతాళం: మండలంలో జనవరి 2, 3 తేదీలలో కేంద్ర బృందం పర్యటించనుందని ఏడీఏ బాలవర్ధిరాజు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఉరుకుంద, ఓబుళాపురం, చిరుతపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. జరిగిన పంట నష్టం గురించి కేంద్ర బృందం అధికారులకు పూర్తిగా వివరించాలని రైతులకు సూచించారు. పెట్టినపెట్టుబడి, జరిగిన నష్టం వారికి తెలపాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి శేషాద్రి తదితరులు ఉన్నారు.

నేడు వ్యవసాయ ఉద్యోగుల సంఘం కార్యవర్గ ఎన్నిక

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి అనుబంధంగా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం మంగళవారం జరగనుంది. బి.క్యాంపులోని ఏపీజీఈఏ కార్యాలయంలో ఈ ఎన్నిక ఉంటుందని వ్యవసాయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హెచ్.రూపేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘంలో ఆఫీసు సబార్డినేట్ నుంచి పరిపాలన అధికారి వరకు అన్ని కేటగిరి ఉద్యోగులు ఉంటారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఉద్యోగులందరు హాజరు కావాలని కోరారు.

బ్యూటీ పార్లర్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత మహిళలకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ బ్యూటీ పార్లర్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కే.పుష్పక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు ఉండి చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. ని శిక్షణలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు నాలుగు ఫొటోలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 90007 10508 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

పాఠశాలలో 13 ట్యాబ్‌లు చోరీ

బనగానపల్లె: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి సుమారు రూ.2లక్షల విలువ చేసే 13 ట్యాబ్‌లు చోరీకి గురైనట్లు హెచ్‌ఎం బాలగంగధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ట్యాబ్‌లు ఉన్న గది కిటికీని ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. కాగా ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు పాఠశాలకు వెళ్లి చోరీ జరిగిన ఘటనపై ఆరా తీశారు.

ఫ్లెక్సీల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

డోన్: మహాత్మా మన్నించు శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు టీడీపీ నాయకులు స్పందించి తమ తప్పును సరిదిద్దుకున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీ కాంస్య విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన టీడీపీ నాయకుల ఫ్లెక్సీల విషయాన్ని సాక్షి వెలుగులోకి తీసుకువచ్చింది. దీతో టీడీపీ నాయకులు సోమవారం ఫెక్సీని తొలగించి వేరొక చోట ఏర్పాటు చేసుకోవడంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు.


కటౌట్ తీసివేసిన దృశ్యం

పట్టపగలే చోరీ


బీరువా తాళాన్ని పగలగొట్టిన దొంగలు

గడివేముల: మండల కేంద్రంలోని నంద్యాల-నందికొట్కూరు ప్రధాన రహదారిలో సీఎస్ఐ చర్చి ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో పట్టపగలే దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాలు.. సోమవారం గ్రామానికి చెందిన కురువ పెద్దన్న కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లారు. గమనించిన దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 8 తులాల బంగారంతోపాటు రూ.13 వేలను ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చోరీ జరిగిందని నిర్ధారించుకుని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

మహానందీశ్వరుడి భూమికి పట్టాదారు పాస్‌బుక్!

- రుణం తీసుకున్న ఇనాందారుడు
- సర్వే చేయించిన దేవస్థానం అధికారులు

మహానంది: మండలంలోని తమ్మడపల్లె గ్రామ పరిధిలో ఉన్న మహానందీశ్వరస్వామి దేవస్థాన భూములను పూర్వం సర్వీస్ ఇనాం కింద కొందరికి ఇచ్చారు. ఇనాం దారుడు తన పేరుతో పట్టాదారు పాసుపుస్తకం పుట్టించి రుణాలు పొందినట్లు గుర్తించామని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమ్మడపల్లె గ్రామంలోని సర్వే నెంబరు 314లో 1.19 ఎకరాలు, 303 సర్వే నెంబరులో 8.74 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. వీటిని కుమ్మరులు, అనకల(మామిడి తోరణాలు కట్టేవారు)కి పూర్వం సర్వీస్ ఇనాం కింద ఇచ్చారన్నారు. వీటిలో 1.19 ఎకరాల భూమికి పట్టాదారు పుస్తకం తయారు చేయించి ఓ బ్యాంకులో రుణం పొందినట్లు గుర్తించామన్నారు. దీంతో పూర్తిస్థాయి విచారణ చేసి సంబంధిత భూములు మహానందీశ్వరస్వామి దేవస్థానానికే చెందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారిని కలిసి విన్నవించామన్నారు. రెవెన్యూశాఖలో పనిచేసే ఓ కీలక ఉద్యోగి ఈ ఘటనకు సూత్రధారి అని సమాచారం. దీంతో పాటు మరో రెవెన్యూ గ్రామ పరిధిలోనూ మహానంది దేవస్థానానికి చెందిన ఐదు ఎకరాల భూమిని కొందరు ఆక్రమించుకుని రుణాలు పొందుతున్నట్లు సమాచారం. వాటి మీద సమగ్ర విచారణ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దొంగలు దొరికారు


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

శ్రీశైలం: చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దొంగల వివరాలను సీఐ ప్రసాద్‌రావు విలేకరులకు వెల్లడించారు. ఈనెల 17న షేక్ ఫకృద్దీన్ తన ఆటోలో ఉన్న అమరాన్ బ్యాటరీని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించనట్లు ఫిర్యాదు చేశాడు. అలాగే పరిసర ప్రాంతాల్లోని టీ స్టాల్స్‌లో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు చోరీకి గురవుతుండటంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా షేక్ మస్తాన్ వలి, జే.భాస్కర్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి బ్యాటరీతోపాటు రెండు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కాగా నిందితులను చాకచక్యంగా అరెస్ట్ చేసిన వన్ టౌన్ పోలీసులు గురవయ్య రాజేంద్ర కుమార్ రఘునాథుడు శివమహేంద్ర, బాలకృష్ణ, నాను నాయక్‌లను సీఐ ప్రశంసించారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్ష


హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూరురూరల్: ద్విచక్రవాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాపాయం నుంచి రక్షించుకోవాలని డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద సోమవారం ఆయన హెల్మెట్ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. డీఎస్పీ హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లతోపాటు పౌరులు కూడా ర్యాలీలో పాల్గొన్నారు. చక్రం హోటల్ వరకు ర్యాలీగా వెళ్లి తిరిగి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు


తీవ్ర గాయాలైన క్లీనర్ అహమ్మద్


లారీలో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్ ప్రవీణ్


నుజ్జునుజ్జు అయిన లారీ ముందు భాగం

బనగానపల్లె రూరల్: మండలంలోని జ్వాలాపురం గ్రామ సమీపంలో దద్దణాల ప్రాజెక్టు వద్ద సోమవారం ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంతకల్లుకు చెందిన లారీ డ్రైవర్ బి ఎర్రన్న, క్లీనర్ అహమ్మద్ పెట్రోల్ లోడ్ ట్యాంకర్‌తో కోవెలకుంట్లకు బయల్దేరారు. తమిళనాడు రాష్ట్రం పెరంబలూరు జిల్లాకు చెందిన ప్రవీణ్ యనకండ్ల గ్రామ సమీపంలోని జయజ్యోతి సిమెంట్ కంపెనీ నుంచి క్లింకర్ లోడ్‌తో గుంతకల్లు వైపు బయల్దేరాడు. దద్దణాల ప్రాజెక్టు మలుపు వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. లారీ డ్రైవర్ ప్రవీణ్ సీటులోనే ఇరుక్కుపోయాడు. మరో లారీ డ్రైవర్ ఎర్రన్న, క్లీనర్ అహమ్మద్ తీవ్రగాయాలపాలయ్యారు. ముగ్గురినీ స్థానికులు అంబులెన్స్‌లో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషాద్రి

కర్నూలు(అర్బన్): స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ కళాశాలల్లో పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ వెంకట శేషాద్రి బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. నగరంలోని ప్రొఫెషనల్ కళాశాలల్లో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ర్యాగింగ్, చైల్డ్ మేరేజెస్, ఉచిత న్యాయ సహాయంపై వ్యాస రచన, షార్ట్ ఫిల్మ్, ఇన్‌స్టాగామ్ రీల్ తయారీ తదితర పోటీలు నిర్వహించారు. రాయలసీమ విశ్వ విద్యాలయం, ఇంజినీరింగ్ కాలేజీ, జీ పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్, సెయింట్ జోసఫ్ మహిళా డిగ్రీ కళాశాల, రామక్రిష్ణా డిగ్రీ కళాశాల తదితర విద్యా సంస్థలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక న్యాయ సేవాసదన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో తమ్ముళ్ల రచ్చ!

- ఎంపీ శబరి, ఎమ్మెల్యే చరిత వర్గీయుల మధ్య వాగ్వాదం
- పరస్పరం దాడికి యత్నం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇరువర్గీయులు

ఓర్వకల్లు: పాణ్యం నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య నానాటికీ విభేదాలు ముదురుతున్నాయి. బహిరంగంగానే ఇరు వర్గాలు బాహాబాహీకి దిగే స్థాయికి చేరుకున్నారు. సోమవారం మండలంలోని ఉయ్యలవాడ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మరోమారు ఎంపీ, ఎమ్మెల్యే వర్గీయుల విభేదాలు రచ్చకెక్కాయి. మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో సోలారు పరిశ్రమ నిర్మాణ విషయంలో ఆది నుంచి ఇరువర్గాల మధ్య పరస్పర వ్యతిరేక అభిప్రాయం ఉంది. ఈ క్రమంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో సోలార్ వివాదం తారాస్థాయికి చేరుకోడంతో బహిరంగంగా కొట్టుకునే వరకూ చేరింది. తహసీల్దార్ విద్యాసాగర్ రెవెన్యూ సదస్సును ఉద్దేశించి మాట్లాడుతుగా.. మధ్యలో ఎంపీ బైరెడ్డి శబరి వర్గీయుడు మహబూబ్‌బాషా స్టేజి వద్దకు వెళ్లి మా గ్రామంలో సోలార్ పరిశ్రమ గురించి ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని చెప్పాడు. ఇంతలోనే గౌరు వర్గీయుడు రమణారెడ్డి కల్పించుకొని సోలార్ ప్రస్తావన ఇప్పుడెందుకు వచ్చింది. ఇది రైతుల సమస్యలను పరిష్కరించుకునే కార్యక్రమం కదా.. ఏమైనా ఉంటే తర్వాత మాట్లాడండి అని అభ్యంతరం తెలిపారు. అనంతరం భోజన విరామానికి వెళ్లిన తర్వాత బజారులో కూర్చున్న గౌరు వర్గీయులను ఎంపీ వర్గీయులు నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు కల్పించుకొని ఇరువురిని వారించి పంపించారు. సాయంత్రం 3 గంటల సమయంలో గౌరు చరిత వర్గీయుడు రాజమోహన్‌రెడ్డి అలియాస్ చిన్నోడు, ఎంపీ వర్గీయులు మహబూబ్‌బాషా, రామకృష్ణ మరోమారు వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరిగి చెప్పులతో కొట్టుకునే వరకూ పరిస్థితి వచ్చింది. గమనించిన పోలీసులు ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇరు వర్గాల వారు ఎస్‌ఐ సునీల్‌కుమార్ ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఘటనపై కేసు నమోదు చేయాలా?, వద్దా? అని పోలీసులు తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది.

అంతర్ జిల్లా దోపిడీ దొంగ అరెస్ట్

- నిందితుడిపై గుంటూరు జిల్లాలో 3 గ్యాంగ్ రేప్ కేసులు


నిందితున్ని చూపుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

బొమ్మలసత్రం: రాష్ట్రవ్యాప్తంగా 11 దొంగతనాలు, 3 గ్యాంగ్‌రేప్‌లు, 4 దారి దోపిడీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న దొంగను జిల్లా పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. దొంగ వివరాలను ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బండి ఆత్మకూరు మండలం నారపురెడ్డికుంట గ్రామానికి చెందిన చెంచు దాసరి సుంకన్న కొన్నేళ్ల నుంచి చోరీలు, దారి దోపిడీలకు పాల్పడేవాడు. ఆగస్టులో నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. యజమాని అమర్చుకున్న సీసీ కెమెరా ఆధారంగా నిందితునిపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. ఈక్రమంలో ఆటో నగర్ వద్ద అనుమానంగా తిరుగుతున్న సుంకన్నను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరాలు అంగీకరించాడు. రాష్ట్రవ్యాప్తంగా 11 చోరీలు, 4 దారి దోపిడీలు, 3 గ్యాంగ్ రేప్ కేసుల్లో నిందితునిగా ఉన్నట్లు ఒప్పుకున్నాడు. అతని నుంచి 3 తులాల బంగారు నల్ల పూసల దండ, ఒక జత 8 గ్రాముల కమ్మలు స్వాధీనం చేసుకున్నారు.

- దాసరి సుంకన్న మరి కొంత మంది నిందితులతో కలిసి 2021 లో 9వ తేది గుంటూరు జిల్లా మేడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో బైక్‌పై వెలుతున్న దంపతులను రాత్రి అటకాయించారు. భర్తపై దాడి చేసి భార్యపై గ్యాంగ్‌రేప్ చేశారు. ఈకేసులో నలుగురు నిందితులకు కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈకేసులో ఏ3 గా ఉన్న దాసరి సుంకన్న పోలీసుల కన్నుగప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు.
- గుంటూరు జిల్లా యడ్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో రెండు గ్యాంగ్‌రేప్ కేసులు నమోదు కాగా వాటిలో ఏ3గా దాసరి సుంకన్న నిందితుడిగా ఉన్నాడు.

క్లుప్తంగా

నూతన సంవత్సర వేడుకలపై ఆంక్షలు

శిరివెళ్ల: 2025 నూతన సంవత్సర వేడుకలపై పోలీస్‌లు అప్రమత్తమయ్యారు. సోమవారం ఎస్‌ఐ చిన్న పీరయ్య మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. మద్యం దుకాణాలు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని తెలిపారు. శుభాకాంక్షల పేరుతో మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించినా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీజేలకు అనుమతి లేదని, వీధుల జంక్షన్ల వద్ద బాణాసంచా పేల్చవద్దన్నారు. రోడ్లపై కేక్‌లు కట్ చేయవద్దన్నారు. ఎవరికీ ఇబ్బందులు కలగకుండా నూతన వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

ఉద్యోగులపై దాడి సరికాదు



నిరసన తెలుపుతున్న ఎంపీడీఓ, ఉద్యోగులు

ఉయ్యాలవాడ: ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ నాయకుల దాడి సరికాదని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లా గాలివీడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జవహర్ బాబుపై రాజకీయ నాయకుల దాడిని ఖండించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటయ్య, పాల్గొన్నారు.

పోరాటాలకు ప్రజలను సిద్ధం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు ప్రజలను సిద్ధం చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌ఖుబార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కరించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. పట్టణానికి అధిక నిధులు కేటాయించి రోడ్లు, డ్రైనేజీ, వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. నాగరాజు, మహమ్మద్‌గౌస్, పుల్లానరసింహ, తోటమద్దులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గురురాజ పాఠశాల కో ఆర్డినేటర్ షేక్ బేగంకు సావిత్రి బాయి పూలే జాతీయ అవార్డుకు ఎంపికైందని వ్యవస్థాపక ఆర్గనైజేషన్ అధ్యక్షుడు నాగయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణానికి చెందిన శ్రీగురురాజ విద్యా సంస్థల్లో 16 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్న పాఠశాల కో ఆర్డినేటర్ షేక్ బేగం ఉత్తమ సేవలను గుర్తించి దక్షిణాది ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆర్గనైజేషన్ జాతీయ స్థాయి అవార్డు అందజేస్తారని చెప్పారు. జనవరి 5న గుంటూరులో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు అందజేస్తారన్నారు.

కత్వా జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పగడాల శ్రీనివాసరావును సోమవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా యామా ప్రసాద్, ఆర్థిక కోశాధికారిగా ఓజా గురునాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మిద్దె తిరుపతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు. రాష్ట్ర నాయకులు ఫణీంద్ర, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగిందన్నారు.

ఎర్రజెండాకు వందేళ్లు పూర్తి

నంద్యాల(న్యూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బైటిపేటలో సోమవారం జెండాను ఆవిష్కరించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ పోరాడుతుందన్నారు. సీపీఐ శాఖ కార్యదర్శి సాలమద్దిలేటి, సహాయ కార్యదర్శి మద్దయ్య, రమేష్, ఆనంద్, సిద్దయ్య, నాగస్వామి పాల్గొన్నారు.

వాతావరణంపై అవగాహన

రుద్రవరం: వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు అ న్నారు. స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో సోమవారం భవిష్యత్తులో వాతావరణ ప్రభావం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా విద్యార్థులు ప్రాజెక్టులను రూపొందించారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని కోరుతూ సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి చౌడప్ప మాట్లాడారు.

మా బతుకులు ఇంతేనా?

- అభివృద్ధికి ఆమడ దూరంలో ఎరుకల కాలనీ
- సొంతింటి యోగానికి నోచుకోని ఎస్టీలు
- నేటికీ రేషన్, ఆధార్ కార్డులు లేవు
- సిమెంటు రోడ్లు, విద్యుత్ సౌకర్యం లేక అంధకారం
- ఇళ్ల కోసం నాయకులు, అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయిన ఎస్టీలు

ఒకే తాగునీటి కుళాయి

ఎరుకలి కాలనీలో కనీసం తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయకపోవటంతో వారు సొంత ఖర్చుతో 20 కుటుంబాలకు ఒక కుళాయిని ఏర్పాటు చేసుకున్నారు. ఆ కుళాయి నుంచి వచ్చే నీరే 20 కుటుంబాల వారికి శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ కాలనీల వారు మోటార్లు వేస్తే తమకు తాగునీరు రావటం కష్టమవుతుందని పేర్కొంటున్నారు. కాలనీలో పైపులైన్ వేయించి కనీసం, రెండు, మూడు కుళాయిలు ఏర్పాటు చేస్తే తాగునీటికి ఇబ్బందులుండవని పేర్కొంటున్నారు.



కాలనీలోని ఏకైక కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

జూపాడుబంగ్లా: ఎన్నేళ్లు గడిచినా ఇలాగే బతకాల్సిందేనా? మా బతుకులు మార్చేవారే లేరా? అంటూ జూపాడుబంగ్లాలోని ఎరుకలి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులతో కాలనీల రూపురేఖలు మార్చుతామని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొంటున్నా అదెక్కడా అమలు కావట్లేదని స్థానిక ఎస్సీ, ఎస్టీ కాలనీలవాసులు పేర్కొంటున్నారు. 43 ఏళ్ల క్రితం జూపాడుబంగ్లాలో 20 ఎరుకలి కుటుంబాల వారు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వారికి ఎలాంటి స్థిర, చరాస్తులు లేకపోవటంతో సిక్కెంట్రుకల వ్యాపారం, పొరకల తయారీ, పందుల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. తమకు పక్కా గృహాలు మంజూరు చేయాలని ఏళ్ల తరబడి ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోకపోవడంతో నేటికీ వారు పూరి గుడిసెల్లోనే తలదాచుకుంటున్నారు. వీరిలో కొంత మందికి ఆధార్ కార్డులు, రేషన్ కార్డు కూడా లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హత ఉన్నా వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయడం లేదంటే ఎస్టీల అభివృద్ధిపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి శ్రద్ధ ఉందో తెలుస్తోంది. ఏళ్లు గడిచినా పక్కా గృహాలు మంజూరు చేయకపోవటంతో ఛిద్రమైన పూరిగుడిసెల్లోనే నివాసం ఉంటూ వర్షం కురిస్తే తడుస్తూ పిల్లా పాపలతో జాగరణ చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకెందుకు ఇప్పటిదాకా పక్కాగృహాలు మంజూరు చేయడం లేదని ఎరుకలి వారు ప్రశ్నిస్తున్నారు.

అందని ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు

గ్రామం ఏర్పడకముందు వచ్చి గుడిసెలు వేసుకున్న స్థలాలు తప్పా ఇప్పటిదాకా ప్రభుత్వం తమకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు ఇవ్వలేదని ఎరుకలి వారు పేర్కొంటున్నారు. దీంతో ఒకే పూరిగుడిసెలో రెండు, మూడు జంటలు తలదాచుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు ఇళ్ల స్థలాలిచ్చి పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.



ఎరుకలివారు నివాసం ఉంటున్న గుడిసెలు

విద్యుత్ సౌకర్యం, సిమెంటు రోడ్లు లేవు

జూపాడుబంగ్లాలోని ఎరుకలి కాలనీలో ఇప్పటికీ సిమెంటు రోడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయలేదంటే వీరు అడవిలో ఉన్నారా? లేక గ్రామాల్లో ఉన్నారా? అనే విషయం అధికారులు, ప్రజాప్రతినిధులే ఆలోచించాల్సి ఉంది. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళ చిమ్మచీకట్లో బిక్కుబిక్కుమంటు కాలం వెలదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిమ్మ చీకట్లో పాములు, తేళ్లు తిరుగుతున్నా అలాగే సంచరిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఓ బాలికకు పాముకాటు వేయటంతో మృత్యువాత పడినట్లు వాపోయారు. సిమెంటు రోడ్లు లేకపోవటంతో చిన్నపాటి వర్షం కురిసినా అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితిలో ఉంటుందని పేర్కొంటున్నారు.



పాత చీరల పరదానే స్నానాల గది

“ కాళ్లరిగేలా తిరిగినా ఇల్లు ఇవ్వలేదు



తమకు ఇల్లు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పక్కా గృహం మంజూరు చేయలేదు. టార్పాలిన్ పట్టలతో ఏర్పాటు చేసుకున్న గుడిసెల్లోనే భార్య, పిల్లలతో తలదాచుకుంటున్నాం. గుడిసెలు ఛిద్రం కావటంతో వర్షం వస్తే పిల్లాపాపలతో జాగరణ చేయాల్సి వస్తోంది.

– చిన్నసుబ్బన్న, ఎరుకలి కాలనీ

నిల్చోవడం కూడా కష్టమే



పక్కాగృహాలు మంజూరు చేయకపోవటంతో పూరి గుడిసెల్లోనే ఏళ్ల తరబడి నివసిస్తున్నాం. ఇంట్లో నిల్చోవాలంటే కూడా ఇబ్బందే. గుడిసెలో కేవలం రాత్రివేళల్లో నిద్రించటానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. పగలంతా గుడిసె బయటే కాలం వెలదీస్తున్నాం. రాత్రివేళల్లో మాత్రమే గుడిసెల్లో తలదాచుకుంటున్నాం. పక్కాగృహాలు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు.

– సుబ్బన్న, ఎరుకలికాలనీ

ఆధార్, రేషన్ కార్డులు లేవు



నాకు, నా భార్యకు ఇప్పటిదాకా రేషన్ కార్డు, ఆధార్ కార్డుల్లేవు. రేషన్ కార్డు కోసం సార్లొళ్ల వద్దకు వెళితే ఆధార్ కార్డు కావాలంటున్నారు. ఆధార్ కార్డు కోసం వెళ్తే రేషన్ కార్డు కావాలంటున్నారు. ఏం చేయాలో తోచక గమ్మునుండిపోయాను. రేషన్‌కార్డు లేనందుకు బియ్యం కూడా ఇవ్వడం లేదు. ఎలాంటి ప్రభుత్వ పథకాలు ఇవ్వడం లేదు.

– గంగన్న, ఎరుకలి కాలనీ

న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలి

ఆళ్లగడ్డ: ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని న్యాయవాది ఖాజీ గౌస్‌మోదీన్ అన్నారు. అనంతపురం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మృతి చెందిన ఘటనకు నిరసనగా సోమవారం స్థానిక న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సివిల్ పంచాయతీ విషయంలో న్యాయవాది శేషాద్రిని అనంతపురం సీఐ స్టేషన్‌కు పిలిపించి అసభ్యకరంగా ప్రవర్తించడంతోనే మానసిక వేదనకు గురై స్టేషన్‌లోనే మృతి చెందడం విచారకరమన్నారు. సమగ్ర విచారణ జరిపి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. న్యాయవాదులు రేష్మ, షాహినా, మురళిమోహన్, చాణిక్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పోలీసుల ఒత్తిళ్లతోనే న్యాయవాది మృతి



న్యాయ దేవత విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): పోలీసుల ఒత్తిళ్లతోనే అనంతపురంతో సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతిచెందాడని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి పెద్ది శ్రీనివాసులు ఆరోపించారు. ఇటీవల న్యాయవాదులపై జరుగుతున్న పోలీసులు దౌర్జన్యాలను నిరసిస్తూ సోమవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. నంద్యాల జిల్లా కోర్టులో న్యాయదేవత విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసి న్యాయాన్ని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీవ్ర భయభ్రాంతులకు గురి చేయడం వల్లే శేషాద్రి గుండెపోటుతో స్టేషన్‌లోనే మృతిచెందాడన్నారు. కడప జిల్లా గాలివీడు మండలానికి చెందిన సీనియర్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డిని కూడా పోలీసులు అవమానకరంగా చొక్కా పట్టుకొని రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు విధి విధానాలను వ్యతిరేకంగా పోలీసులు వ్యవహరించడం తగదన్నారు. సివిల్ పంచాయతీలలో జోక్యం చేసుకోకూడదని కోర్టులు ఆంక్షలు విధించినప్పటికీ పోలీసుల తీరు మారడం లేదన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు విజయశేఖర్‌రెడ్డి, తిరుపతి, ఎంఆర్ కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సుదాంశమౌళిరెడ్డి, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అనంతపురం న్యాయవాది శేషాద్రి పోలీసు స్టేషన్‌లో మృతిచెందడానికి పోలీసులే కారణమని నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది రామకృష్ణ, నటరాజ్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి దుంగలు స్వాధీనం

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరు సమీపంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన నీలగిరి దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు సోమవారం తెలిపారు. స్థానిక అటవీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ''ఆలమూరు–యాదవాడమెట్ట వద్ద కొంత అటవీ భూమి ఖాళీగా ఉంది. ఆ భూమిలో కొన్నేళ్ల క్రితం అప్పటి అధికారులు నీలగిరి మొక్కలు నాటగా ఏపుగా పెరిగాయి. వాటిపై కొందరు దుండగుల కన్ను పడింది. రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా వృక్షాలను కూల్చి దుంగలుగా మార్చుకొని తరలించేందుకు సిద్ధం చేసినట్లు సమాచారం అందింది. వెంటనే ఆలమూరు సెక్షన్ అధికారి మక్బర్ బాషా, ఎఫ్‌బీఓ బాషా దాడి చేసి దుంగలను స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. పట్టుబడిన దుంగలను ఆలమూరు అటవీ కార్యాలయం వద్దకు తరలించినట్లు తెలిపారు.



అటవీ అధికారులకు పట్టుబడిన నీలగిరి దుంగలు

క్యాలెండర్ల ఆవిష్కరణ

చాగలమర్రి: ఎస్టీయూ 2025 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ అనురాధ, యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ.. డైరీ, క్యాలండర్‌ను సందేశాత్మకంగా ముద్రించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మహబూబ్‌హుసేన్, నాయకులు నారాయణరెడ్డి, శేషాద్రి, సురేషప్ప తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, యూనియన్ నాయకులు

మైనర్లు బైక్ నడిపితే సీజ్ చేస్తాం



మాట్లాడుతున్న సీఐ వంశీధర్

శిరివెళ్ల: మైనర్లు వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని సీఐ వంశీధర్ అన్నారు. సోమవారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు డ్రైవింగ్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. సైబర్ నేరగాళ్లు సెల్‌ఫోన్లకు మేసేజ్‌లు చేస్తున్నారని.. వారి వలలో పడవద్దన్నారు. ఆత్యాశకు పోతే ఉన్న డబ్బులు పోతాయన్నారు. ఏంతో మంది వారి వలలో పడి లక్షాది రూపాయలు పోగొట్టుకుని పోలీసుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఇన్‌స్టాగాం ద్వారా కొంత మంది విద్యార్థులు తెలియక తప్పులు చేస్తున్నారన్నారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, ఎక్కడైనా జరుగుతుంటే తమ దృష్టికి తీసుకునిరావాలని కోరారు. మత్తుపదార్థాలకు జోలికి వెళితే బంగారు భవిష్యత్ నాశనమవుతుందని తెలిపారు. బాలబాలికలు అన్నాచెల్లెల్లా కలిసిమెలిసి చదువుకోవాలని సూచించారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకునిరావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్న పీరయ్య, ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం, టీచర్లు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల సహకార సంఘంలోని ఖాతాదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సీఈఓ సుబ్బారావు సోమవారం తెలిపారు. సున్నావడ్డీ రుణాలు, ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందాలంటే ఆయా సచివాలయల్లో ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే సహకార సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుందని, లేదంటే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ఖాతాదారులు ఈ-కేవైసీని చేయించుకోవాలని సూచించారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

ఉయ్యాలవాడ: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లోని రైతులు(ఖాతాదారులు) ఆయా గ్రామ సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సొసైటీ సీఈఓలు రామచంద్రయ్య, మౌళాలి తెలిపారు. కేవైసీ చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి వివిధ సంక్షేమ పథకాలు, రాయితీలు వర్తించడంతో పాటు సంఘంలో ఓటు హక్కును పదిలంగా ఉంచుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఉయ్యాలవాడ: మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డిపై దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నూర్ అహమ్మద్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో గ్రామంలోని వాటర్ ఫిల్టర్ ట్యాంకు సమీపంలో కూర్చుని ఉన్న విష్ణువర్ధన్‌రెడ్డిని అదే గ్రామానికి చెందిన తరిగోపుల జశ్వంత్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, తులసిరెడ్డి పాత కక్షలు మనసులో పెట్టుకుని ప్లాస్టిక్ పైపులతో దాడి చేసి గాయపరిచారని తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ బిల్లులు వసూలు చేయండి

గోస్పాడు: విద్యుత్ వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు సూచించారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది వెంటనే స్పందించాలని చెప్పారు. గ్రామాల్లో వినియోగదారులకు బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పించి త్వరితగతిన చెల్లించేలా చూడాలని తెలిపారు. మీటరు లేకుండా విద్యుత్‌ను వినియోగిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లైన్ ఇన్‌స్పెక్టర్లు నాయక్, ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బరక సంజీవరాయ స్వామికి పూజలు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన బరక సంజీవరాయస్వామికి సోమవారం అమావాస్య పురస్కరించుకొని అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన పూజలను ఆలయ పురోహితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

భారత ఖ్యాతిని పెంచిన మన్మోహన్ సింగ్



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నంది రైతు సమాఖ్య సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నంది రైతు సమాఖ్య, మాతృభాష పరిరక్షణ సమితి ప్రతినిధులు సోమవారం స్థానిక కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ విలక్షణ విదేశాంగ విధానాలతో ప్రభుత్వాలకు మార్గదర్శకంగా నిలిచి భారతావని ఖ్యాతిని పెంచారని కొనియాడారు. ప్రధానమంత్రిగా అంతర్జాతీయ స్థాయిలో భారత్ కీలక పాత్ర పోషించేలా తీర్చిదిద్దారన్నారు. సమితి ప్రతినిధి అన్నెం శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కైలాసనాథరెడ్డి, కొండా మోహన్‌రెడ్డి, హరినాథరెడ్డి, కవులు నీలకంఠమాచారి, శేషఫణి ప్రసాద్ పాల్గొన్నారు.

కాశినాయన ఆశ్రమ సహకారం అభినందనీయం



భోజనాలు వడ్డిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(వ్యవసాయం): రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఓంకారం కాశిరెడ్డి నాయన ఆశ్రమం సహకారంతో కలెక్టర్ కార్యాలయంలో అర్జీ దారులకు ఏర్పాటు చేసిన భోజన వసతి కార్యక్రమం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో భోజన వసతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అర్జీ దారులు దాదాపుగా 350 మందికి పైగా వస్తుంటారని, వారికి రుచికరమైన, శుభ్రమైన వివిధ రకాల ఆహార పదార్థాలను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారులు ఇక్కడే భోజనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంతో పేదలకు ఆకలి బాధ తప్పుతుంద.ఇ, అలాగే ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయని చెప్పారు. రెడ్‌క్రాస్ అధ్యక్షుడు దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు, వెంకటసుబ్బయ్య, డీఈఓ జనార్దన్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ చింతామణి, ఉస్మాన్ బాషా పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో హెడ్‌కానిస్టేబుల్ ప్రతిభ



దాశరథిని అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు అహ్మదాబాద్‌లో జరిగిన ఆలిండియా ఇంటర్ రైల్వే షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024లో హెడ్‌కానిస్టేబుల్ దాశరథి విజయం సాధించాడని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు వంశీధర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పురుషుల 45 ప్లస్ సింగిల్స్ రన్నరప్, పురుషుల 50ప్లస్ సింగిల్స్ విజేత, పురుషుల 50 ప్లస్ డబుల్స్‌లో రన్నరప్‌గా నిలవడంతో ఈనెల 26న ఐఆర్‌పీఎస్ ఐజీ అరోమాసింగ్ ఠాకూర్ చేతుల మీదుగా దాశరథి బహుమతి తీసుకున్నారని వివరించారు. కేరళ రాష్ట్రంలో జరగబోయే ఆలిండియా పోలీసు మీట్–2025కు ఎంపికై నట్లు చెప్పారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం



సమావేశానికి హాజరైన అధికారులు

ఉయ్యాలవాడ: ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏదైనా సమస్యలు అర్జీ రూపంలో వచ్చినప్పుడు సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రజా వేదిక కార్యక్రమాన్ని కొందరు అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ గైర్హాజరవుతున్నారన్నారు. విద్య, వైద్యం, ఆర్టీసీ, వెలుగు, ఐసీడీఎస్, మైనర్ ఇరిగేషన్, తదితర కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

నూతన వేడుకలకు గంగుల దూరం

ఆళ్లగడ్డ: నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. తన మేనత్త మృతి చెందిన కారణంగా నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు ఎవరూ ఆళ్లగడ్డ పార్టీ కార్యాలయానికి రావద్దని సూచించారు.

న్యూఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

దొర్నిపాడు: మండలంలో 30 పోలీస్ యాక్టు అమల్లో ఉందని.. న్యూఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఆరు నెలల జైలు శిక్ష, జరిమానా విధించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహన యాజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో వాహనాలను అతివేగంగా నడిపినా చర్యలు తీసుకుంటామన్నారు. శుభాకాంక్షలు తెలిపే సమయంలో ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్ చేసే ప్రమాదం ఉన్నందున మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోడ్లపై ట్రాఫిక్ జామ్ చేసి కేక్‌లు కట్‌చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదని, రోడ్లపై టపాసులు కాల్చవద్దన్నారు. మద్యం షాపులు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సమయం వరకే తెరవాలన్నారు.